

అక్షయపాత్రకు స్థలం కేటాయింపు

శ్రీకాకుళం అర్బన్: ఇచ్ఛాపురంలో అక్షయపాత్ర నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం తరపున కేటాయిస్తామని కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద ఉన్న అక్షయపాత్రను కలెక్టర్ శనివారం సందర్శించారు. ఇచ్ఛాపురంలో అక్షయపాత్రను ఏర్పాటుచేసి చుట్టుపక్కల మండలాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ చెప్పారు. ఇచ్ఛాపురంలో అన్నింటికీ అనువుగా ఉండే ప్రాంతంలో అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని కలెక్టర్ అక్షయపాత్ర మేనేజర్ పి.వెంకటరాజుకు తెలిపారు. అయితే నిర్మాణం, అవసరమైన యంత్ర సామగ్రిని అక్షయపాత్రే సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్షయపాత్రలోని వివిధ విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల విద్యార్థుల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, ఇకపై అటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఆయన వెంట డిఇఒ పగడాలమ్మ, అక్షయపాత్ర సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని నమ్మబలికిన ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరుతో పేదలకు విద్యకు దూరం చేస్తూ కార్పొరేటీకరణకు అనువుగా మారుస్తున్నాయని, దీన్ని ప్రతిఘటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పేర్కొన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం విద్యారంగం నాడు-నేడు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం తూచ తప్పకుండా శరవేగంగా అమలు చేస్తోందన్నారు. పాఠశాలల విలీనం, ఉపాధ్యాయ పోస్టుల కుదింపు, పాఠశాలల ఎత్తివేత వంటి చర్యలు అందులో భాగమేనన్నారు. మరోవైపు ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. యూనివర్సిటీలో చదువు చెప్పేందుకు అధ్యాపకులు లేని దుస్థితి నెలకొందన్నారు. పేదలందరికీ ఉచితంగా విద్యను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావడం జరుగుతుందని, రాజ్యాంగ బద్ధంగా కొన్ని హక్కులను చట్టబద్ధం చేయడం జరిగిందని, కానీ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. ఇటువంటి విధానాలను ప్రతి ఘటించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు డి.చందు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షతోనే రామశేషు హత్య

- కేసును ఛేదించిన పోలీసులు
- గ్రామానికి చెందిన వారే సూత్రధారులు
- నలుగురు నిందితులు అరెస్టు
- కేసు వివరాలను వెల్లడించిన ఎస్‌పి జిఆర్.రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గార మండలం శ్రీకూర్మంలో ఈ నెల ఆరో తేదీన సంచలనం సృష్టించిన వైస్ ఎంపిపి, మాజీ సర్పంచ్ బరాటం రామశేషు హత్య కేసును పోలీసులు ఛేదించారు. అందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి జిఆర్.రాధిక శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆధిపత్య పోరు, వ్యక్తిగత కక్షతోనే రామశేషను హత్య చేశారని ఆమె చెప్పారు. శ్రీకాకుళం పట్టణ డిఎస్‌పి ఎం.మహేంద్ర పర్యవేక్షణలో సిఐ తన ప్రత్యేక బృందాలతో కలిసి దర్యాప్తు సాగించారని తెలిపారు.

రామశేషు గ్యాస్ గోడౌన్ దగ్గర తన బుల్లెట్‌ను పెట్టి అక్కడి నుండి దువ్వుపేట వైపు నడుచుకుంటూ వెళుతుండగా ఉదయం సుమారు 6:30 నుండి 6:40 గంటల మధ్యలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి, హెల్మెట్ పెట్టుకొని వాళ్ల దగ్గర ఉన్న కత్తితో నరికి చంపి, దాన్ని దగ్గరలోనే పడేసి పరారైనట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. అనంతరం శ్రీకాకుళం డిఎస్‌పి పర్యవేక్షణలో వివిధ బృందాలు గాలించి సిసి కెమెరాలు, టెక్నాలజీని ఉపయోగించి క్షేత్ర స్థాయి సమాచారం ఆధారంగా త్వరితగతిన దర్యాప్తు జరిపామని తెలిపారు.

గ్రామానికి చెందిన వారే నిందితులు

శ్రీకూర్మం గ్రామానికి చెందిన తలకోల సుధాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు రవీంధర్‌రెడ్డి ఘటన తర్వాత గ్రామం నుండి అకస్మాతుగా పరారైనట్లు తెలిసిందన్నారు. వారిపైన నిఘా పెంచామని, వారికి చెందిన షెడ్లో ఎవరో ఇద్దరు కొత్త వ్యక్తులు సుమారు రెండు నెలల నుండి ఉండే వారని సమాచారం వచ్చిందన్నారు. దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం తలకోల సుధాకర్‌రెడ్డి, కొడుకు రవీంధర్‌రెడ్డి పరారయ్యేందుకు ఆమదాలవలస రైల్వే స్టేషన్ వెలుపల సిద్ధంగా ఉన్నారని తెలిసి శ్రీకాకుళం సిఐ సిబ్బందితో వెళ్లి ఇరువురితో పాటు అనుమానాస్పదంగా ఉన్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. తమకు రామశేషు అన్ని విధాలుగా అడ్డువస్తున్నాడని, గతంలో తమను అనేక రకాలుగా అవమానించాడన్న కారణంతో చంపాలని నిర్ణయించామని వారు అంగీకరించినట్లు ఎస్‌పి తెలిపారు. రవీంధర్‌రెడ్డికి పరిచయం ఉన్న మల్లెల వెంకటసుబ్బారెడ్డితో రూ.4లక్షలు కిరాయికి ఒప్పందం చేసుకున్నారని ఆమె వెల్లడించారు. సుమారు రెండు నెలల నుండి తమ షెడ్డులో ఉంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని, రామశేషు చుట్టూ ఎప్పుడూ జనం మధ్య ఉండటంతో వారికి సాధ్యపడలేదన్నారు.

నిందితులు ఇలా పట్టుబడ్డారు

రామశేషును వీలైనంత తొందరగా చంపాలని ఈ పనికి సుబ్బారెడ్డి, రవీంధర్‌రెడ్డికి సహాయంగా మరొకరు ఉండాలనే ఉద్దేశంతో రవీంధర్‌రెడ్డి తనకు పరిచయం ఉన్న సుంకరపాలెం గ్రామానికి చెందిన సావాడ శ్రీనుతో కిరాయి మాట్లాడినట్లు చెప్పారు. సుమారు 10 రోజుల నుండి రెక్కీ చేసి ఈ నెల ఆరో తేదీ ఉదయం సుమారు 6.15 నిమిషాల సమయంలో రామశేషు ఒక్కడే బులెట్‌పై వెళ్లడం చూసి వారు వెంబడించారు. రామశేషు గ్యాస్ గోడౌన్ వద్ద బుల్లెట్ పెట్టి దువ్వుపేట వైపుగా నడిచి వెళ్తుండగా రామశేషుపై వెనుక నుంచి వెళ్లి హఠాత్తుగా తలపై, ముఖంపై కత్తితో దాడి చేసి చంపి, కొద్ది దూరంలో కత్తులను పడవేసి అక్కడ నుండి పరారయ్యాని తెలిపారు. నిందితులు ముందు అనుకున్న ప్రకారం శనివారం ఆమదాలవలస రైల్వే స్టేషన్ మెట్టక్కివలస రోడ్డువైపు ఉన్న పార్కింగ్ సమీపంలో వీరు కలిసినట్లు చెప్పారు.

నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన ఎస్‌పి జిఆర్.రాధిక

నిందితులు సావాడ శ్రీను, సుబ్బారెడ్డి తమ కిరాయి డబ్బులు ప్రస్తావించగా ఇప్పుడు అంత డబ్బు లేదని ప్రస్తుతం ఖర్చుల కోసం చెరో రూ.10వేలు చొప్పున ఇచ్చేందుకు రవీంధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు రావడం చూసి వారంతా తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించారని, వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి శనివారం మధ్యాహ్నం 13.30 గంటలకు అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.20వేలు నగదు, వారు నేరమునకు ఉపయోగించిన మోటార్ సైకిల్, వేరొక కత్తిని, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కేసును ఛేధించడంలో చాకచక్యంగా పనిచేసిన శ్రీకాకుళం డిఎస్‌పి మహేంద్ర, శ్రీకాకుళం రూరల్ సిఐ సన్యాసినాయుడు, వన్ టౌన్ ఎస్ఐ గణేష్, రూరల్ ఎస్ఐ విజయకుమార్, గార ఎస్ఐ మధుసూదనరావు, ఇతర పోలీసు సిబ్బందికి ఎస్‌పి నగదు బహుమతి అందజేసి, ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పాలనా సంస్కరణలను స్వాగతించండి

మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొస్తున్న పాలనా సంస్కరణలను స్వాగతించాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం జాతీయ పెన్షనర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల అనుభవాలను అందించి.. నేటి తరం తప్పటడుగులు వేయకుండా సరిదిద్దాలన్నారు. అనుభవానికి మించిన ప్రత్యామ్నాయం ఇంకొకటి లేదని చెప్పారు. ప్రతినిత్యం ప్రజా శ్రేయస్సు ఆశించి, సంస్కరణలకు ఆనవాలుగా నిలిచి, సమాజానికి ప్రతినిధిగా ఉన్నందుకు ఆనందంగా ఉందన్నారు. పరిపాలనలో వచ్చిన మార్పుల, అభివృద్ధికి సంబంధించి చేపడుతున్న పనులను స్వాగతించాలన్నారు. స్వాతంత్ర్య వచ్చిన తొలినాళ్లలోనే దేశానికే ధాన్యాగారం అందించిన చరిత్ర రాష్ట్రానికి ఉందని, కానీ విద్యలో వెనుక బడ్డామన్నారు. అందుకే భవిష్యత్ తరలాలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం ఆరాట పడుతోందన్నారు. అందుకోసమే బడుల పునర్నిర్మాణ పనులను నాడు-నేడు పేరిట చేపట్టామన్నారు. ఉపాధ్యాయుల స్థానంలో సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖలో కీలక మార్పులు తీసుకొచ్చామన్నారు. భూముల సర్వే చేసి సుమారు వంద ఏళ్లు అవుతోందన్నారు. ఇప్పుడు రీ సర్వే చేసి, సంబంధిత భూ హక్కు పత్రాల పంపిణీకి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ సంస్కరణలను స్వాగతించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్, జిల్లా ట్రెజరీస్ డీడీ రవికుమార్, విశ్రాంత జెసి రజనీకాంతరావు, విశ్రాంత తహశీల్దార్ డిపి దేవ్, పెన్షనర్ల సంఘాల జెఎసి నాయకులు కూన తవిటినాయుడు, న్యాయశాఖ రిటైర్డు ఉద్యోగి కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు
- చిలకపాలెంలో రిలే దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులకు వెంటనే న్యాయం చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరావు పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యాన శనివారం చిలకపాలెం వద్ద టోల్ ప్లాజా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. చిలకపాలెం టోల్ ప్లాజా ఎత్తివేసి నాతవలస, మడపాం టోల్ ప్లాజాల్లో టోల్ రుసుంను పెంచి ఆదాయం తగ్గకుండా సర్దుబాటు చేసిన అధికారులు రోడ్డున పడ్డ 15ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను సర్దుబాటు చేయకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వారిని సర్దుబాటు చేయని పక్షంలో గ్రాట్యూటీ, నష్ట పరిహారం చెల్లించాలని, వెంటనే యూనియన్‌తో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హైవే పీడీని రెండు సార్లు కలిసి విన్నవించామని, కార్మికుల సమస్య పరిష్కారానికి యూనియన్‌తో ఇంతవరకు చర్చించలేదని అన్నారు. చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా కార్మికులను రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏ విధంగా బతకాలని, వారి పిల్లలు స్కూల్ ఫీజులు ఏ విధంగా చెల్లించాలని ప్రశ్నించారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలాకాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని యూనియన్, నేషనల్ హైవే అధికారులతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. నిరాహార దీక్షలో కె.ఏడుకొండలు, బి.ఓంశాస్త్రి, పి.రాము, పి.జగన్నాథరావు, బి.నాగభూషణరావు కూర్చున్నారు. కార్యక్రమంలో చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.వి.రమణ, డి.వి.నర్సింహులు, ఎ.వి.ఆర్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పట్టాలు పొంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు తక్షణమే పనులు ప్రారంభించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. శనివారం పొన్నాడలోని అర్బన్ లేఅవుట్-1, 2, 3లను ఆయన సందర్శిచారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు ఉండాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం పెద్ద ఎత్తున అర్హులైన వారికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేసిందన్నారు. జిల్లాలో 77వేల గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. పొన్నాడలో 2829 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశామని, అందులో 1100 మంది అడ్వాన్స్‌గా నిర్మాణాలు ప్రారంభించినట్లు వివరించారు. మిగిలిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. కాలనీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అన్ని సౌకర్యాలూ అందుబాటులోకి వస్తున్నాయన్నారు. లే అవుట్‌లో సిమెంటు రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. పొన్నాడ లే అవుట్ నగరపాలక సంస్థ పరిధిలో ఉండటం వల్ల మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి వీలుందన్నారు. రూ.లక్షలు వెచ్చించి భూమి కొనుగోలు చేసి పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. నిర్మాణాలు ప్రారంభించని స్థలాల్లో కొత్త వారికి మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ గణపతిరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఎఇలు గణపతిరావు, సుగుణాకర్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

యాచకత్వాన్ని ప్రోత్సహిస్తే చర్యలు

సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పిల్లలతో యాచకత్వాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ రూపొందించిన స్టేట్‌ప్లాన్ అఫ్ యాక్షన్‌కి అనుగుణంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవా సదన్ నిర్వహించారు. పిల్లల్లో యాచకత్వం నిరోధించే అంశంపై నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో సన్యాసినాయుడు మాట్లాడారు.

పిల్లల్లో యాచకత్వాన్ని నిర్మూలించి వారిని మంచి భావి భారత పౌరులుగా తయారు చేసే బాధ్యత అందరిపైనా ఉందని, యాచకత్వం చేసే పిల్లలు ఎవరైనా కనిపిస్తే సాధారణ పౌరులు కూడా పోలీసులకు, చైల్డ్‌లైన్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం అందించాలని కోరారు. చాలా మంది పేదరికం సాకుగా చెప్పి పిల్లల్ని యాచకత్వంలోకి దించుతున్నారని, అటువంటి వారికి అండగా ప్రభుత్వంతో నడుపబడుతున్న సంస్థలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో దిశా డిఎస్‌పి వాసుదేవరావు, డిప్యూటీ కమిషనరు ఆఫ్ లేబర్ ప్రసాదరావు, కెవి.రమణ, శ్రీలక్ష్మి, తలే లక్ష్మణరావు, న్యాయవాది ఇందిరా ప్రసాద్, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

గడపలో గుబులు.. అభివృద్ధిలో అలుసు

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నేతలను ప్రజల ముంగిట నిల్పేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. మొన్న నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలు, వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో బాగా వెనుకబడ్డ వారిలో జిల్లాకు చెందిన మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఉండటం జిల్లా పార్టీలో చర్చనీయాంశమైంది. గడప గడపకు కార్యక్రమంలో ఎక్కువ రోజులు పాల్గొనాలని, ఎక్కువ సమయం కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పున్నా కారణాలు ఏవైనా వారికి పట్టలేదని స్పష్టమైంది. ప్రజల ముంగిటకు వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించడం, వారు చెప్పే సమస్యలను పది రోజుల్లో పరిష్కరించేలా చూడాలని ముఖ్యమంత్రి తాజా సమీక్షా సమావేశంలో వివరించారు. సమస్యంతా అక్కడే ఉందని నేతలు చెవులు కొరుక్కుంటున్నట్లు నేతలు ఎదిగిన కొలది ఒదిగి ఉండాలని ముఖ్యమంత్రి గొప్ప ఉద్బోధించారు. కానీ ఈ జిల్లా మంత్రి అప్పలరాజుకు అదే కొరవడిందని ఆయన సన్నిహిత అనుయాయులు చెప్పున్నారు. ఈ కాలంలో ఆయన ఎదుర్కొన్న వివాదాస్పద పరిణామాలు అందుకు ఉదాహరణ అని గుర్తు చేస్తున్నారు. పదవులు, అధికారం చెలాయించడానికి కాదు, ప్రజలకు సేవ చేయడానికి అని సిఎం ఉద్బోధించారు. కానీ మంత్రి అప్పలరాజు ప్రజలకు చేసే సేవ ఎలా ఉన్నా ఆ పార్టీ కార్యకర్తలతోనే సఖ్యత లేకుండా పోయింది. ఒదిగి ఉండటం, సేవా భావం కలిగి ఉండటం అంతా మిథ్యగానే ఉందన్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లోనే బాగా ఉంది. అప్పలరాజుకు టిక్కెట్ ఇస్తే ఆయన్ను ఓడిస్తామని ఆ నియోజకవర్గంలోని పార్టీ నేతలు ప్రకటించడం చూశాం. మిమ్మల్ని ఎవరినీ వదులుకోవడానికి సిద్ధంగా లేనని సిఎం చెప్తూనే ప్రజలకు చేరువకాకపోతే మార్చేస్తానని స్పష్టం చేయడం విశేషం. అదే సమయంలో రాబోయే మూడు నెలల్లో ఎవరు గడప గడప కార్యక్రమాన్ని అలక్ష్యం చేసినా వారి స్థానంలో కొత్త వారిని తీసుకొస్తామని చెప్పినట్లయింది. అందుకే జిల్లాలో పికె బృందం విస్తృతంగా తిరుగుతోంది. ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఇప్పుడున్న నేతల్లో ఎవరికి టిక్కెట్ ఇవ్వకున్నా వారికి ప్రత్యామ్నాయంగా ఎవరన్నది సర్వే జరుగుతున్నట్లు తెలిసింది. ప్రతీ నియోజకవర్గంలోనూ ముగ్గురు, నలుగురిని గుర్తించి, వారి సామాజిక తరగతులతో పాటు, ఇతర అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. ముందుగా పార్టీ శ్రేణుల్లోని అభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రూపులు బలంగా పని చేస్తున్నాయి. జిల్లా అధ్యక్షులుగానీ, ఇన్‌ఛార్జి మంత్రిగానీ గ్రూపులను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఎలాంటి ప్రయత్నాలు చేపట్టడం లేదు. మాటలతో హితబోధ చేస్తున్నారు తప్ప, గ్రూపుల మూలాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయడం లేదని తెలిసింది. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించిన తరువాత ఎవరు ఎటుపోతారు, అందరూ కలిసి పని చేస్తారన్న నమ్మకంతో నేతలున్నట్లు తెలిసింది.

జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే దిక్కులేకుండా పోయింది. అభివృద్ధి నిలిచిపోయింది. గడప గడపకు కార్యక్రమంలో ఎదురవుతున్న ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతీ సచివాలయం పరిధిలోని పనులకు రూ.20 లక్షలు కేటాయించినా అవి ఏ మూలకు చాలడం లేదు. అందువల్లనే అభివృద్ధి మాటంటేనే ప్రభుత్వానికి అలుసుగా ఉందన్న భావన ఆచరణలో కనిపిస్తోంది. అభివృద్ధి పట్ల చిన్నచూపు చూడటం, తేలిక భావంతో ఉండటం కనిపిస్తుందనే పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఏ ప్రాజెక్టు పని ముందుకు సాగలేదు. అధికారులు, నేతలు ఒత్తిడి చేసి, బిల్లులు ఇప్పిస్తాం పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పబ్బం గడిపేశారు. కాంట్రాక్టర్లు చేతులు కాల్చుకొని అప్పుల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయం వ్యవస్థ నిర్మాణాలకు, ఆర్‌బికెల పనులు చేపట్టినా వాటి బిల్లులు కాక జిల్లాలో గోల చేస్తున్న వారిలో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలున్నారు. పాలకొండ, రాజాం రోడ్డు కోసం ఆర్అండ్‌బిశాఖ ఓ కాంట్రాక్టరును ఒప్పించి, భయపెట్టి రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేయించారు. మీకెందుకు డబ్బులిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు చేతులెత్తేసినట్లు తెలిసింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల్లో గొప్ప విజయాన్ని సాధించామని గొప్పులు చెప్పుకున్న జిల్లా నేతలకు ఇప్పుడు గొంతులో గుమ్మడికాయ పడ్డ చందమైంది. జిల్లాకు సంబంధించి రూ.మూడు వేల కోట్లకు బిల్లులు బకాయిలున్నాయని తెలిసింది. పంచాయతీ ఎన్నికల్లో సగటున జిల్లాలో ప్రతీ సర్పంచ్ అభ్యర్థి రూ.50 లక్షలకు తక్కువ లేకుండా ఖర్చు చేసినట్లు తెలిసింది. ఎన్నికైన సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను రద్దు చేయడం, పంచాయతీలకు జమకావాల్సిన నిధులను ప్రభుత్వమే స్వాహా చేయడంతో వారిలో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. జిల్లాలో డోలు వచ్చి మద్దెలతో చెప్పిన చందంగా నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ మరో సమస్య వచ్చి పడింది. ప్రతీ సచివాలయం పరిధిలో ముగ్గురు సమన్వయకర్తలను ప్రతీ వాలంటీర్ల పరిధిలో ఇద్దరేసి గృహ సారథులను జనవరి 20వ తేదీలోగా నియమించుకోవాలని నేతలకు సిఎం ఆదేశించారు. ఇలాంటి వ్యవస్థ క్షేత్రస్థాయిలో గ్రూపులను ప్రోత్సహించేందుకు తోడ్పడతాయని సీనియర్లు చెప్తున్నారు. ఇప్పుడు మే ము ఎదుర్కోబోయే బాధలను ఎవరికి చెప్పుకోవాలని నగరంలోని ఒక నేత తన ఆవేదనను వ్యక్తం చేశారు. పంచాయతీల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ, నగర పాలక సంస్థల్లోనూ ఇప్పటికే పదవులను ఆశించే నేతలు పలువురున్నారు. ఆ వార్డులకు తామే నాయకులమని సచివాలయాల పరిధిలో ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. సచివాలయం పరిధిలో మరో ఇద్దరు సమన్వయకర్తలకు బాధ్యతలు అప్పగించడంతో ఆ ముగ్గురు మధ్య నాయకత్వంపై పోటీ ఏర్పడుతుంది. గ్రూపులకు శ్రీకారం చుట్టినట్లవుతుంది. ప్రశాంత్ కిశోర్ వ్యూహంలో భాగంగానే ఈ కొత్త దొంతర కింది స్థాయిలో తీసుకొచ్చినట్లు తెలిసింది. ఇటీవల ముఖ్యమంత్రి అవినీతి వార్తలపై అప్రమత్తంగా ఉండాలని మంత్రులకు హెచ్చరించినట్లు వార్తలొచ్చాయి. మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు తప్ప, అవినీతికి దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పకపోవడం మంత్రుల్లో చర్చనీయాంశమైంది. పారదర్శకత పాలనలో ప్రజలున్నారు. కీలక సమాచారం లీక్ అవ్వకుండా చూడండని సిఎం చెప్పిన రోజే సిఎం చేసిన కీలక వ్యాఖ్యలు మీడియాకు చేరాయి. అంతే పాలనా వైఫల్యాలను కొందరు మంత్రులే బయటకు లీక్ చేస్తున్నారని స్పష్టమైంది. అలా లీక్ చేసిన వారిలో జిల్లా మంత్రి ఒకరున్నారని తెలిసింది.

ప్రధాన ప్రతిపక్షం వైఫల్యం

జిల్లాలో టిడిపి అధినేత పద్ధతినే అనుసరిస్తున్నారు. మీడియా పులులుగా ఉన్నారు తప్ప, ప్రజల్లోకి వెల్లడం లేదు. ఈ కాలంలో ప్రజలను సమీకరించి ఏ ఒక్క సమస్యపై ఉద్యమించే దాఖలాల్లేవు. ప్రభుత్వ అధినేతపై దూషనలు, విమర్శలు చేయడం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు కర్మ సిద్ధాంతం ప్రచారం మొదలు పెట్టింది. ఏ కర్మతో గత ఎన్నికల్లో 23 సీట్లు వచ్చాయో ఇప్పటికైనా టిడిపి నేతలు ఆలోచించడం మంచిది. కేంద్రంలోని ఎ(1) ముద్దాయిని చంకన పెట్టుకొని రాష్ట్రంలోని ఎ(2) ముద్దాయిపై విమర్శలు దాడి చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. జిల్లాలో కొందరు వైసిపి, టిడిపి నేతల మధ్య రాజకీయ సంబంధాలు, వ్యాపార సంబంధాలు బలంగా ఉన్నాయి. తమ సామాజిక తరగతి ప్రయోజనాల కోసం రాజకీయాలు వదిలేసి కుటుంబాలు ఏకమౌతాయన్న ప్రచారం జిల్లాలో ఎప్పటి నుంచో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాలనా తీరు, ప్రధాన ప్రతిపక్షం రాజకీయ వ్యూహం మదిలోనే జిల్లాకు కొంత మేరకైనా నష్ట నివారణ జరుగుతుంది.

-సత్తారు భాస్కరరావు

రథసప్తమి ఏర్పాట్లకు టెండర్లు

రూ.11.55 లక్షలతో పనులకు వేలం పాట ఖరారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీ సూర్య నారాయణస్వామి దేవస్థానంలో సూర్య జయంతిని పురస్కరించుకొని జనవరి 28న రథసప్తమి సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించి శనివారం టెండరు కం వేలం పాట నిర్వహించారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలోని అనివేటి మండపంలో శనివారం వేలం పాట నిర్వహించారు. దేవస్థానం, పోలీస్ శాఖలు పేర్కొన్న ప్రదేశాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేయడానికి పిల్లా మౌళి రూ.2 లక్షలు, విద్యుత్ దీపాలంకరణకు ఉంగటి పాపారావు రూ.2.75 లక్షలకు పాటను దక్కించుకున్నారు.

షామియానాలు కార్పెట్లు వేయడానికి ఉంగటి రామ్మోహన్‌రావు రూ.2 లక్షలు, ఇంద్రపుష్కరిణి వద్ద 13 టేకు చెట్లు, ఏడు నీలగిరి చెట్లను తొలిగించి తీసుకెళ్లడానికి ఉంగటి పాపారావు రూ.30వేలు, రంగులు వేయడానికి బురగాన మోహన్‌బాబు రూ.4.50 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారని ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు , జిల్లా దేవాదయ ధర్మదాయశాఖ ఇఒ సర్వేశ్వరరావు, ఆలయ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బిఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MACT AT SRIKAKULAM
I.A 1168/2021 IN M.V.O.P. 119/2018

Between: Kalisetty jagannadham .... Petitioner

And: Telli Baburao ..... And 2 others

R1 Telli Babu Rao son of ramulu age about 40 years Viswa-Brahmin by caste, driver of Crime vehicle i.e,. **VAN No AP 31W7863** resident of Tapi mestri colony, ponduru village and mandal Srikakulam district.

NOTICE

Please take note is that above **I.A 1168/2021** is posted to **04-01-2023** for your appearance you are you are hereby directed to appear before the Honourable court on **04-01-2023** at **10:30 A.M.** either impression or through an advocate without fail and file your objections file if any, otherwise the matter will be decided in your absence

NAKKA PRASAD RAO,
Advocate,
Srikakulam
cell: 97 018 44 297

ఆదిత్యుని చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ హరిసూర్యప్రకాష్

ఆలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామి వారికి పలు సేవలు నిర్వహించారు. సేవల అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేష వస్త్రాలను, జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. ఈమెతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి వి.సుజాత శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో, వేద మంత్రాలు నడుమ ఆమెకు అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖమండపంలో స్థల మహత్యం, ఆలయ నిర్మాణ గాధలను ఆమెకు అర్చకులు వివరించి, స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ శిఖర దర్శనం చేసుకుని, ఆలయ గోడలపై ఉన్న శిల్ప సౌందర్యాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఈమెతోపాటు జిల్లా జడ్జి జునైయద్ అహమ్మద్ మౌలానా, కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ, నరసన్నపేట సిఐ డి.రాము, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.శ్రీనివాస్, ఆర్ఐ సతీష్, ఇఒ ప్రభాకరరావు ఉన్నారు.

పరామర్శిస్తున్న రవికుమార్

రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

పొందూరు: పల్నాడు జిల్లా మాచెర్లలో టిడిపి నాయకులపై, వారి ఇళ్లపై జరిగిన దాడులు వైసిపి ప్రభుత్వం గూండాయిజం, అల్లర్లు, దాష్టికపాలనకు నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలోని కింతలి, తుంగపేట, కొంచాడ, తండ్యాం, రాపాక, కృష్ణాపురం గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి సానుభూతుపరుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రజల దృష్టికి తీసుకువెళ్తుంటే... వైసిపి నాయకులు ఓర్వలేక దాడులకు పాల్పడుతూ అరాచకం సృష్టిస్తున్నార న్నారు. రాష్ట్రంలో పులివెందుల ఫ్యాక్షన్ నడుస్తుందని, పూర్తిగా శాంతిభద్ర తలు క్షీణించాయని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు చోద్యం చూస్తూ అధికార పార్టీకి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. టిడిపి నాయకులు బి.శంకరభాస్కరరావు, పి.రాంప్రసాద్, హనుమంతు రావు, రవి, తవిటినాయుడు, వేణుగోపాలం, లక్ష్మణరావు, అప్పల నాయుడు, గొల్లయ్య, మహేష్, సూర్యారావు, ప్రభాకరరావు ఉన్నారు.

పెన్షన్ రాజ్యాంగం కల్పించిన హక్కు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉద్యోగులకు పెన్షన్ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రభుత్వం యాజమాన్యం దయ తలచి ఇచ్చే దానం కాదని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ నాయకులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, హెచ్.వి.సత్యనారాయణ అన్నారు. జాతీయ పెన్షనర్స్ డేను పురస్కరించుకుని పట్టణంలోని అన్వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అక్కడ నుండి పెన్షనర్లకు బకాయి పడిన తొమ్మిది నెలల కరువు భత్యం, 21 నెలల పిఆర్‌సి ఎరియర్స్, ఇహెచ్ఎస్ స్కీం సక్రమంగా అమలు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 18 నెలల కరువు భత్యం బకాయిలు, క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను చెల్లించాలని కోరారు. అనంతరం వాసవి ఆర్యవైశ్య సరస్వతి భవనంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ వి.ఎ.ఎన్.మూర్తి మాట్లాడుతూ పెన్షనర్లకు నెల మొదటి వారంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఎటువంటి ఇబ్బంది లేకుండా పెన్షన్లను చెల్లిస్తున్నామని తెలిపారు. ఉప ఖజానా అధికారి వి.సువర్ణరాజు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఇందులో భాగంగా 16 మంది సీనియర్ పెన్షనర్లకు

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న పెన్షనర్లు

దుశ్శాలువ కప్పి సన్మానించారు. సమావేశంలో ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.వి. రమణ, పెన్షనర్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి నందిగాం, సంతబొమ్మాళి మండలాల పెన్షనర్లకు టెక్కలిలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ శిబిరాన్ని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు తదితరులు ప్రారంభించారు. ఈ మేరకు మదర్ థెరిసా, విశ్వజ్యోతి కళాశాలల, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్ల విద్యార్థులు, స్టేట్‌బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారి టి.రామకృష్ణ, జి.వి.రెడ్డి, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రవికుమార్, ట్రెజరర్ బొడ్డ అయ్యబాబు, వీరాస్వామిరెడ్డి, స్టాలిన్, హరిశ్చంద్రరావు, కామేశ్వరరావు, నాగభూషణరావు, నంబూరు షణ్ముఖరావు, గడ్డయ్య పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో విశ్రాంత ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, విశ్రాంత హశీల్దార్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావును సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షులు బి.మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, డి.వి.ఎన్.ఆచారి, కె.సోమసుందరరావు, బి.జయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు విజయకుమార్ పర్యవేక్షణలో గుండె, కేన్సర్ వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్మయరావు, డి.వి.ఎస్.సోమేషన్, టి.వీరభద్రస్వామి, పి.ఎస్.ప్రసాదరావు, కె.సవరయ్య, ముత్యాలమ్మ, రాంబాయి పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఎనిమిది మంది ఉద్యోగులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తమ్మినేని మాధవరావు, కార్యదర్శిగా నెమలిపురి అప్పారావు, కోశాధికారిగా పాలవలస అప్పయ్య మాస్టారు, వైస్ ప్రెసిడెంట్‌గా బెల్లాల నరసింగరావు మాస్టార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పొందూరు : స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో విశ్రాంత ఉద్యోగులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టిఒ కె.ఎస్.ఎస్.ప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధి కె.శాంతారాం, జెన్కో డైరెక్టర్ బి.ఎ.కుమార్, సంఘ గౌరవ అధ్యక్షులు దండా సూరిబాబు, డాక్టర్ డి.వి.ఎస్.ప్రకాశరావు, సంఘం కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు, గ్రామీణ బ్యాంకు మేనేజర్ డి.సుదర్శనరావు, విశ్రాంత డిప్యూటీ ఇఒ ఎ.సోమేశ్వరరావు, విశ్రాంత హెచ్‌ఎం బి.మన్మథరావు, రాష్ట్రపతి అవార్డు గ్రహిత పి.కూర్మారావు పాల్గొన్నారు.

టెక్కలి : రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్

పలాస : విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక ఎమ్మెల్యే బెందాలం అశోక్ శనివారం మండలంలోని సిహెచ్.గొల్లగండిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాలంటూ అంటూ ప్రచారం చేశారు. ఒక్కసారి ఛాన్స్ అంటూ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని నమ్మి అవకాశం ఇచ్చినందుకు ఇదా దుస్థితి అంటూ నినాదాలు చేశారు. అన్ని సంస్థలను, రంగాలను ధ్వంసం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.నగేష్, చిత్రాడ శ్రీను, జి.కె.నాయుడు, జోగారావు, నీట్ట గోపాల్, రెల్ల శ్రీను, ఎస్.చంద్రమోహన్, బాబూరావు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్రంలో వైసిపి పాలన భయంకరంగా ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస మున్సిపాలిటీ 17, 18 వార్డుల్లో టిడిపి నేతలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అందులో భాగంగా వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ

సోంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

వైఫల్యాలను, అసమర్థతను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను లిఖితపూర్వకంగా నమోదు చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నిరుద్యోగ సమస్య, నిత్యవసర ధరలు, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లొడగల కామేష్, , బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, గొళ్ల చంద్రరావు, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బొరివంకలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, లోళ్ల శ్రీను, బాసుదేవ్ రౌలో, బెందాలం విజయ్, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, సంతోష్ పట్నాయక్, పుల్లట రాజు, పుల్లట సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, కాళ్ల జయదేవ్, నందిక జాని, కొండ శంకర్‌రెడ్డి, లీలారాణి, నందిగాం కోటేశ్వరరావు, రెయి, జానకిరావు, కేఖర్, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని నివగాంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, పి.మోహనరావు, కుదిగాం సర్పంచ్ నెల్లి అచ్యుతరావు, అగతముడి అరుణ్‌కుమార్, వీరభద్రస్వామి, సర్పంచ్ ప్రతినిధి మీసాల సోమేష్, బూరాడ నీలంనాయుడు, గార నారాయణరావు, బి.వెంకటరావు, శ్రీనుబాబు, మాధవ్, వెంకటరమణ పాల్గొన్నారు.

19 నుంచి సిఎం జన్మదినోత్సవాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఈ నెల 19 నుంచి 21 వరకూ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు కార్యక్రమాలను ప్రజాప్రతినిధులతో కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 19న క్రీడా సంబరాలను ఆయా చోట్ల నిర్వహించాలన్నారు. 20న విరివిగా మొక్కలు నాటాలన్నారు. 21న మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించాలని సూచించారు. పేదలకు దుస్తులు, పళ్లు పంపిణీ చేయాలన్నారు. ఈ అన్ని కార్యక్రమాలకూ వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

'ఐతమ్' ఎంబిఎ విద్యార్థులకు సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులకు శనివారం సదస్సు నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడకు చెందిన కార్పొరేషన్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ (సెబి) మేనేజర్ అనురాగ్వాల్ శనివారం పాల్గొని ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక వనరులు, పెట్టుబడి రంగంలో సెబీ పాత్ర, షేర్ల కొనుగోలు, అమ్మకాలు, మ్యూచివల్ ఫండ్స్లో పెట్టుబడి లాభమా? నష్టమా? వంటి అంశాలపై క్షుణ్ణంగా వివరించినట్టు పేర్కొన్నారు. సదస్సు నిర్వాహక పర్యవేక్షలు ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫిన్సింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎంబిఎ హెచ్‌ఐడి డాక్టర్ కె.వేణు గోపాల్‌కు ఇటు వంటి సదస్సులు మరిన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఒటిఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి- పోలాకి

డిసిసిబిలో రైతులను రుణ విముక్తి చేసేందుకు అనుసరిస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని బెలమర పంచాయతీలో డిసిసిబి ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సొసైటీలో 2016కు ముందు తీసుకుని ఇంతవరకు బకాయిలు ఉన్న వారు ఈ నెల 31లోగా ఒటిఎస్ ద్వారా తీర్చుకుంటే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రస్తుతం రూ.50 లక్షల వరకు వసూలు చేయాల్సి ఉందన్నారు. అలాగే బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. తులం బంగారంపై రూ.33 వేలు 7 శాతం వడ్డీకి అందజేస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో రూ.270 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. స్వయం శక్తి సంఘ మహిళలకు రుణాలు అందజేస్తామన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వెంకటేష్

జవహర్‌రెడ్డిని కలిసిన వెంకటేష్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో నెలకున్న ప్రధాన సమస్యలను పరిష్కారానికి చొరవ చూపాలని విఎన్ఎం ఫౌండేషన్ చైర్మన్ వజ్రపు వెంకటేష్ కోరారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ సుధారాణి

నేటి నుంచి వినియోగదారుల వారోత్సవాలు

ప్రజాశక్తి- నందిగాం

ఈ నెల 18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని తహశీల్దార్ ఎం.సుధారాణి పిలుపునిచ్చారు. మండల వినియోగ దారుల సంఘం అధ్యక్షులు, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలంతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. వినియోగదారులు చైతన్యమైతే మోసాలను అడ్డుకట్ట వేయగలమన్నారు. 'వినియోగదారుల కమిషన్‌లో కేసులు సమర్థవంతంగా నిర్వహించడం అనే అంశంపై ప్రభుత్వం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.


తనిఖీ చేస్తున్న వెంకటేష్

కొత్త పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను తనిఖీ అధికారి వెంకటేష్ శనివారం పరిశీలించారు. రాపాక సచివాలయం-1లో 17, సచివాలయం-2లో 16 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు తెలిపారు. పింఛన్లు మంజూరైన వారి అర్హతా పత్రాలను పరిశీలించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈయనతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లు పుష్పలత, అప్పన్న, మహాలక్ష్మి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

బ్యాంకు వద్ద గస్తీ ఏర్పాటు చేయాలి

బూర్జ : మండలంలోని గుత్తావల్లి ఎపి గ్రామీణ వికాస బ్యాంకు వద్ద పోలీస్ రక్షణ కల్పించాలని మేనేజర్ డి.వీరబాబు కోరారు. ఈ మేరకు శనివారం పోలీసులను ఆశ్రయించి వినతిపత్రం అందజేశారు. ఈ బ్యాంకులో ఖాతాదారులకు సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలు ఉన్నాయని, వీటికి రక్షణ కల్పించేందుకు రాత్రి వేళ గస్తీ ఏర్పాటు చేయాలని ఎస్ఐ అశోక్ బాబుకు రాతపూర్వకంగా విన్నవించారు.

ప్రయివేటుకు ధీటుగా...

కోటబొమ్మాళి: మండలంలోని అక్కయ్యవలస ఎంపియుపి పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడడం చూస్తే వీరు ఏ కార్పొరేటు పాఠశాలలో చదువుకున్నరో అనుకోకతప్పటం లేదు. ఆరు నుంచి పదో తరగతి వరకు పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ సాధన చేయించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శనివారం అక్కయ్యవలస ఎంపియుపి పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయులు షణ్ముఖరావు పార్యవేక్షణలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను సహజ ఆవాసాల వద్దకు తీసుకెళ్లి ఇంగిష్‌లో మాట్లాడారించారు. వీరి సంభాషణలు పలువురు విద్యావంతులను ఆకట్టుకుంది. దీనిని స్వస్థల సంభాణలు అని పేరుతో పిలుస్తున్నారు. రైల్వే ఎంక్వయిరీ, డాక్టర్ అండ్ పేషంట్, షాప్ కీపర్

షాపు వద్ద ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

అండ్ కస్టమర్ ఇలాంటి సంభాషణలతో పిలులు అదరగొడుతున్నారు. ఇటీవల ఓ షాపుకు వెళ్లి షాప్ కిపర్, కస్టమర్ లాగా ఆరో తరగతి విద్యార్థులు హరిత, లహరి చేసిన స్కిట్ వివిధ సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతుంది. ఈ విషయం డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య దృష్టిలో పడటంతో వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు.

బొడ్డపాడు రైతులకు అండ

రైతులను పరామర్శిస్తున్న దుర్గారావు

పలాస: మండలంలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 76, 77లో రైతుల భూముల విషయంలో జనసేన పార్టీ రైతులకు అండగా ఉంటుందని జనసేన నాయకులు డాక్టర్ దుర్గారావు అన్నారు. బొడ్డపాడులో బాధిత రైతులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల భూముల ను తీసుకోవడంతో పాటు రైతులపై దాడి చేయడం అమానుషంగా భావిస్తున్నామన్నా రు. విప్లవాలకు పురిటిగడ్డలో రైతులకు అన్యాయం జరగడం బాధాకరమన్నారు. రైతులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుం డా స్థానిక రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని తన గుప్పట్లో పెట్టుకుని బలవంతంగా లాక్కునేందుకు చేస్తున్న ప్రయత్నాలను రైతాంగం తీవ్రంగా ప్రతిఘటించారన్నారు. దానికి ప్రతీకారంగా స్థానిక వైసిపి నాయకులు రెవెన్యూ సిబ్బందిని ఉసుగొల్పి మహిళా రైతులపై దాడులు చేయడం సరికాదన్నారు. స్థానిక మంత్రి జగనన్న కాలనీ పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

పొందూరు : గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

బూర్జ : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని వైద్యాధికారులు పి.శివశంకర్, బి.చాందినిలు కోరారు. మండలంలోని రాపాకలో హెల్త్‌వెల్‌నెస్ కేంద్రంలో శనివారం 104 వాహనం ద్వారా వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మంచం పట్టిన రోగులు, గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, జ్యోత్స్న, ఎఎన్ఎంలు ఉదయలక్ష్మి, వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, డిఇఒ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాజేశ్వరి, ఉషారాణి, పుణ్యవతి పాల్గొన్నారు.

53 మందికి వైద్య పరీక్షలు

బూర్జ : బూర్జ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎ.పి.పేట పంచాయతీ కె.కె.రాజపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. బూర్జ పిహెచ్‌పి వైద్యాధికారి రాజశేఖర్, 104 డాక్టర్ పి.సుధీర్‌కుమార్ 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సి లక్ష్మీబాయ్, ఎఎన్ఎం ఆమని, ఎంఎల్‌హెచ్‌పి జి.లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కె.జగదీష్, కె.వెంకటరమణ, అసిరినాయుడు, అచ్చయ్యమ్మ పాల్గొన్నారు.

'గ్రిగ్స్' విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన నాలుగో జోనల్ గ్రిగ్స్ క్రీడా పోటీల్లో ఆమదాలవలస గెలుపొందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు దుప్పల రామారావు అభినందనలు తెలియజేశారు. హైస్కూల్ ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ బాలుర విభాగంలో టి.గణేష్ 1500 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, ఎన్.గణేష్ 3 వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, జూనియర్ బాలుర విభాగంలో ఐ.రామకృష్ణ, 800 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానం, 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, సీనియర్ బాలికల విభాగంలో పి.ఢిల్లేశ్వరి 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. ఎ.ప్రజ్ఞ

జి.సిగడాం : అభినందిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

3000 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, ఎన్.త్రివేణి వంద మీటర్లు రన్నింగ్‌లో తృతీయ స్థానం, జి.అనురాధ 1500 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 4ఇంటు100 మీటర్ల రిలేలో పి.శ్రీమణి, డి.రంజిత, కె.సౌమ్య, ఐ.భార్గవిలు రెండో స్థానం సాధించారు. పి.శ్రీమణి 800 మీటర్లు 1500 మీటర్లు రన్నింగ్, హైజంప్ పోటీలో ప్రథమ స్థానం పొందారు. అలాగే వ్యక్తిగత ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఈ క్రీడల పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారికి శిక్షణను ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.జనార్ధనరావు, హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు అభినందనలు తెలియజేశారు.

బూర్జ : ఆమదాలవలస మండలం తొగారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన నియోజకవర్గ ఫోర్త్ జోన్ స్థాయి బాల బాలికల (గ్రిక్స్) క్రీడా పోటీల్లో కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాటసాల విద్యార్థులు విజయభేరీ మోగించారు. ప్రథమ స్థానంలో 15 మంది, ద్వితీయ స్థానంలో 12 మంది, తృతీయ స్థానంలో 8 మంది విద్యార్థులు లాంగ్ జంప్, హైజంప్ వంటి అథ్లెటిక్ పోటీల్లో ఎంపికై పతకాలను, మెమోంటోలను పొందారు. విజేతలకు హెచ్‌ఎం.పద్మావతి, పిఇటి ఈద్ అప్పన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

జి.సిగడాం : ఆమదాలవలస మండల తొగరాం జిల్లా పరిషత్‌లో నియోజకవర్గస్థాయి, డి.బొందపల్లి హైస్కూల్ మండలస్థాయి నిర్వహించిన గ్రిగ్స్ పోటీలో సంతవురిటి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు టి.విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బి.రాము, పిఇటి బి.యుగంధర్, ఉపాధ్యాయులు కె.కృష్ణారావు, సిహెచ్.కమలాకర్, యోగ ఉపాధ్యాయులు సింహాచలం అభినందనలు తెలిపారు.


బూర్జ : ప్రశంసాపత్రాలను చూపిస్తున్న బాలికలు


ఆమదాలవలస : ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం రామారావు

ఎయిడెడ్ పాఠశాలలు అప్పగింత

జలుమూరు: మండలంలోని రామయ్యవలస, మాకివలస గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలను, ఆస్తులను ఆ యాజమాన్యం డబ్బిరు వెంకటరమణ ప్రభుత్వానికి అప్పగించినట్లు ఎంఇఒ బమ్మిడి మాధవరావు తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం ప్రభుత్వం నియమించిన కమిటీ ఆయా పాఠశాలలను

మాకివలసలో ఆస్తులను కొలుస్తున్న కమిటీ సభ్యులు

సందర్శించారు. ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం పాఠశాలలతో పాటు ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు ఆర్అండ్‌బి డిఇ ఎతిరుపతిరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐ సతీష్‌లతో కలిసి ఆయా పాఠశాలలను సందర్శించి ఆస్తుల విలువలను అంచనా చేశామని పేర్కొన్నారు. నివేదికలను పాఠశాల విద్యా కమిషనర్‌కు పంపించనున్నట్లు చెప్పారు. వీరితోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రారంభానికి ముందే ఆహుతి

జలుమూరు: ప్రారంభానికి ముందే ఓ వస్త్ర దుకాణం అగ్నికి ఆహుతైన సంఘటన జలుమూరు మండలంలో చోటు చేసుకుంది. చల్లవానిపేట కూడలి వద్ద శ్రీముఖలింగం వెళ్లే దారిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హ్యాపీ షాపింగ్ స్టోర్‌లో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు ధర్మాన రమణ, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో బట్టల షాపు నుంచి బయటకు పొగరావడం పక్కనే డాబా పైన ఉన్న సావిత్రి హోటల్ యజమాని శ్రీనివాసరావు, కూడలి వద్దనే నివాసం ఉంటున్న వాలంటీర్ బాలరాజు బట్టల షాపు భవనం, దుస్తుల షాపు యజమానులు పట్ట త్రినాథరావు, ధర్మాన రమణకు ఫోన్ చేసి తెలియజేశాడు. వారు వెంటనే షాపు వద్దకు చేరుకొని షట్టర్ తెరిచారు. అప్పటికే దట్టంగా పొగ అలముకోవడంతో లోపలకు వెళ్లేం దుకు ప్రయత్నించారు. వారికి ఊపిరి ఆడకపో వడంతో కొద్దిసేపు బయటనే ఉండిపోయారు. లోపల పొగంతా బయటకు వెళ్లిన తరువాత లోపలకు వెళ్లి సామగ్రిని బయటకు తీసుకువ చ్చారు. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది శకటంతో ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నరసన్న పేట సిఐ బి.రాము, ఇన్‌ఛార్జి ఎస్ఐ బి.లావణ్య, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని శనివారం ఆధారాలను సేకరించారు. బట్టల షాపు వద్ద ఐదు లీటర్ల ఖాళీ పెట్రోల్ క్యాన్‌తోపాటు అగ్గిపెట్టె, ఖాళీ


వివరాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

క్వార్టర్ బాటిల్ లభ్యమైంది. షాపులో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలకు అనుసంధానించిన కంప్యూ టర్ మాయమైంది. అలాగే షాపులో ఎంట్రన్స్‌కు పక్కన ఉన్న గోడపై గోల్ల రంగుతో బూతులు కూడా రాసి ఉన్నాయి. దీంతో ఎవరో కావాలనే షాపుకు నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. పక్క షాపులో బయటకు ఉన్న సిసి టివి పుటేజీని పోలీ సులు పరిశీలించారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. బాధితుని ఫిర్యా దు మేరకు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు వి లువైన దుస్తులు, గిఫ్ట్ ఆర్టికల్స్ అగ్నికి ఆహుతయ్యా యని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

లోకేష్‌రాజు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న లోకేష్ రాజు వైశ్యరాజుకు విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగంలో పిహెచి పట్టాను మంజూరు చేసిందని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ ఎం.ఎస్.అనూరాధ, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మిల మార్గదర్శకత్వంలో 'ఎనలిటికల్ స్టడీ ఆన్ హైబ్రీడ్ రీకాన్ఫిగరబుల్ మోనోపోల్ యాంటిన్నాస్ ఫర్ వైర్లెస్ కమ్యూనికేషన్ అప్లికేషన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఎయు ఈ పిహెచ్‌డి పట్టాను జారీ చేసిందన్నారు. డాక్టర్ వైశ్యరాజు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ అరెస్టా డాక్టర్ డి.ఆజాద్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

స్థానికులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

హరిపురంలో గడప గడపకు...

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని హరిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నేరుగా అర్హులకు సంక్షేమ పథకం అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ ఎస్.సుగుణ, దేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, పైలా దేవదాస్‌రెడ్డి, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, కారంగి మోహనరావు, సర్పంచ్ చల్ల విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

హరిపురం పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని హరిపురం పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులు, భోజన పథకం అమలు తీరును వెలుగు ఎపిఎం ప్రసాదరావు శనివారం పరిశీలించారు. ప్రభుత్వం గత నెల 21 నుంచి మధ్యాహ్న భోజన పథకంలో మెనూ మార్పు ఏ విధంగా పాఠశాల నిర్వహిస్తున్నారు, పిల్లలందరికీ సకాలంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? నీటి సదుపాయం ఎలా ఉంది? పిల్లలు భోజనం చేసే పరిసరాల్లో పరిశుభ్రత ఎలా ఉంది? అనే అంశాలను పరిశీలించారు. అలాగే నాడు-నేడు మంజూరైన నిధులు ఏ మేరకు ఖర్చు అవుతున్నాయి? నిర్మాణ పనులు ఏ స్థితిలో ఉన్నాయి? పాఠశాల పేరెంట్స్ కమిటీ సక్రమంగా సమావేశాలకు అవుతూ బాధ్యతలు తీసుకుంటున్నారా? లేదా? బడి మానేసిన పిల్లలు మళ్లీ స్కూల్‌లో చేర్పించడానికి కార్యాచరణ, విద్యార్థినీ విద్యార్థులో అకడమిక్, నాన్ అకాడమిక్ కార్యక్రమాలపై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు.

మొక్కలు నాటుతున్న రామారావు

మొక్కలతో పర్యావరణ సమతుల్యత

ప్రజాశక్తి- కంచిలి

మొక్కల నాటడం ద్వారానే పర్యావరణ సమతుల్యతను సాధించగలమని గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ నర్తు రామారావు అన్నారు. మండలంలోని ఎమ్మెస్ పల్లి మోడల్ పాఠశాలలో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాలరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ కొనపల సురేష్, ఎంపిటిసి బి.విశ్వనాథం, ఎస్.శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ఉపేంద్రరెడ్డి, ఓంకార్, తిరుమల పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు హెచ్‌బి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ తడక జోగారావు అధ్యక్షతన ఎఎన్‌ఎం విద్యావతి, హెల్త్ అసిస్టెంట్ హేమంత్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య, ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

మండలంలోని పలాసపురం పంచాయతీ స్థానిక పెరటి వీధిలో చేతి పంపు పాడవ్వడం తో స్థానికుల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సర్పంచ్ జోగారావు మరమ్మతులు చేయించారు. తాగునీటికి స్థానికులు పడుతున్న ఇబ్బందులు చూసి, పంచాయతీ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

నాగేశ్వరరావు మృతి టిడిపికి లోటు

ప్రజాశక్తి- నరసన్నపేట

పార్టీ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, మాజీ పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు బలగ నాగేశ్వరావురావు మృతి టిడిపికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే బొగ్గు రమణమూర్తి అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం నాగేశ్వరరావు సంతాపసభ నిర్వహించారు. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టిడిపి చేసిన సేవలను, జ్ఞాపకాలను పార్టీ నాయకులతో, కార్యకర్తలుతో పంచుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

బూర్జ : మాట్లాడుతున్న ధర్మారావు

ప్రజాశక్తి- బూర్జ

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అందజేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ధర్మారావు సూచించారు. మండలంలోని వైకుంఠపురం, ఉప్పినివలస గ్రామ పంచాయతీల్లో ఉన్న జగనన్న లేఅవుట్లను శనివారం పరిశీలించారు. జగనన్న కాలనీలో ఇప్పటికే ప్రారంభమైన ఇళ్లకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించామన్నారు. ఈ నెల 21న గృహప్రవేశాలు ఉన్నాయని, త్వరితగతిన సామగ్రిని అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, వైస్ ఎంపిపి కృష్ణంనాయుడు, వైకుంఠపురం సర్పంచ్ వెంకట సత్యం బొడ్డేపల్లి, ఉప్పినివలస సర్పంచ్, ప్రతినిధి వెంకట్ రమణ, డిఇఇ పురుషోత్తమరావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు. అలాగే కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాలువలు వంటి సౌకర్యాల కల్పనపై సమీక్షించారు.

కోటబొమ్మాళి : జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని నారాయణవలస, తిలారు పంచాయతీల్లో ఉన్న జగనన్న కాలనీలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఎవ్వరి నుంచి ఏదైన సమస్య ఉంటే తమకు తెలియజేయాలన్నారు. జగనన్న కాలనీలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఇప్పటికే రోడ్డు, విద్యుత్, తాగునీటి పనులు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్ఎఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కావ్య, సర్పంచ్ ప్రతినిధి గొద్దు చిరంజీవి, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

కంచిలి : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండలంలోని మకరంపురంలోని జగనన్న కాలనీ లేఅవుట్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, తహసీల్దార్ హైమావతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా మీ గమ్యస్థానానికి చేరుకోవాలని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు అన్నారు. కాశీబుగ్గ చైతన్య విద్యా సంస్థ ఆధ్వర్యాన స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం కాశీబుగ్గ రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. విద్యార్థులు ప్లే కార్డులు పట్టుకొని స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వరకు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఉండాలన్నారు. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం, హెల్మెట్ ధరించకపోవడం చాలా ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.వి.ఎన్.మూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల ఎజిఎం సురేష్, జిల్లా రీజినల్ ఇన్‌ఛార్జి రామనాయుడు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ బాలరాజు, డిన్ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాము, జోగారావు, ఎస్ఐ రమేష్, మనోజ్, షణ్ముఖరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాసరావు

బాధిత కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేటకు చెందిన వలస మత్స్యకారుడు కారి ఎరుకయ్య ముంబాయిలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబానికి తీరప్రాంత వాడబలిజ రాష్ట్ర నాయకుడు మూగి శ్రీరామ్మూర్తి శనివారం పరామర్శించి రూ.5 వేలు, 25 కిలోల బియ్యం వితరణగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో విస్తారమైన తీర ప్రాంతం ఉన్నప్పటికీ మత్స్యకార కుటుంబాలకు ఈ ప్రాంతంలో ఉపాధి లేక ముంబాయి, గోవా, గుజరాత్ వంటి ప్రాంతాలకు వలసలు పోతున్నారని అన్నారు. అక్కడ ప్రమాదాల్లో చిక్కుకొని మృతి చెందుతున్నారని, దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట వైస్ ఎంపిపి వంక రాజు, ఎంపిటిసి ప్రతినిధి మద్దు రాంప్రసాద్, మాజీ సర్పంచ్ గోసాల శంభూరావు, ఎం.గురుప్రసాద్, పల్లేటి బాలు, ఉప్పాడ శ్రీకాంత్, కోడ జానకి ఉన్నారు.

నగదు అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

ఘనంగా విమానయాన దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విమానయానం అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణమని జిల్లా పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, ఇంటెక్ పూర్వ కన్వీనర్ రాధాప్రసాద్‌లు అన్నారు. స్థానిక ఉమెన్స్ కళాశాలలో ఎయిర్ ట్రావెలర్ అసోసియేషన్ ఆధ్వర్యాన విమానయాన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైట్ సోదరులు విమానం కనుగొని సౌకర్యవంతమైన ప్రయాణానికి నాంది పలికారన్నారు. ఏటా విమానం పుట్టిన రోజును శ్రీకాకుళం అసోసియేషన్ ఘనంగా నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నటుకుల మోహన్, ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరాములు, విశాఖపట్నం ఎఐఎటి ప్రతినిధులు ప్రశాంత్, మాధవ్, వరం హీరో షోరూం అధినేత అంధవరపు ప్రసాద్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బాడాన దేవభూషణరావు, సురంగి మోహనరావు, టి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నారాయణరావు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : ఈ నెల 18న తొగరాం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే భాగంలో తొగరాం, జి.కె. వలస, నిమ్మతొర్లాడ, మర్రికొత్తవలస, చీమలవలస, కొర్లకోట, నెల్లిపర్తి, కట్యాచార్యులపేట, హనుమంతు పురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

పరామర్శిస్తున్న రామారావు

క్షతగాత్రునికి 'నర్తు' పరామర్శ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి నాయకులు హరిబందును ఎపి గ్రీనింగ్ బ్యూటీఫికేషన్ ఛైర్మన్ నర్తు రామారావును శనివారం పరామర్శించారు. శుక్రవారం కవిటి మండలం గొర్లెపాడులో వైసిపి, టిడిపి నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో హరిబందు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రామారావు పరామర్శించారు. హరిబందు ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనుషను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐ డి.వి.వి.సతీష్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈయన వెంట కంచిలి వైసిపి నాయకులు ఇప్పిలి కృష్ణారావు, కవిటి నాయకులు కడియాల ప్రకాష్, సర్పంచ్ వల్లభరావు, నర్తు ప్రేమ్, వైఎస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి ఉన్నారు.

పౌర హక్కుల రక్షణ పోరులో 50 ఏళ్లు

పలాస : ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణకు ఆవిర్భవించిన పౌరహక్కుల సంఘం డిసెంబరు 24 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు పత్రి దానేస్ అన్నారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద పౌర హక్కుల 50వ మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50వ మహాసభలు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1973లో పాలకుల నిర్బంధానికి, రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల రక్షణకు ఈ సంఘం ఆవిర్భవించింది అన్నారు. ఉపాధ్యక్షులు పిండి వెంకటరావు, సహాయ కార్యదర్శి సోమనాథ్, జిల్లా కమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, దున్న కృష్ణ, జోగారావు, దానయ్య, వైకుంఠరావు, కూర్మారావు, తిరుపతి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ దేవుళ్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎపి సిఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌ఛార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు రాగి పంటను పండించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పలాస ఎడి ఎల్.మధుబాబు మాట్లాడుతూ 2022లో మండలంలో మూడు రాగి క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. రాగి పంటను గులిరాగి పద్ధతిలో సాగుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పలాస సబ్ డివిజన్ పరిధిలో 11 రాగి క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం రేపటి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి జి.ఎండయ్య, ఎఒ దానకర్ణుడు, సూర్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పలాస ఎడి మధుబాబు

పారిశుధ్య సేవలు భేష్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మేజరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యానికి పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో అభినందలను వెల్లువెత్తుతున్నాయి. కోటబొమ్మాళి పంచాయతీ కార్యదర్శిగా యోగేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు ద్వారా సేకరించి డపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. నిత్యం పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వీధులు రోజూ శుభ్రం చేయించి, చెత్తను తొలగిస్తున్నారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో శనివారం డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి యోగేశ్వరరావు

తిరుపతిరావుకు సన్మానం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బేశీ రామచంద్రపురం ఉన్నత పాఠశాలలో శనివారం ప్రముఖ గణిత అష్టావధాని తిరుపతిరావు ఆధ్వర్యాన దశావతానం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రోత్సాహకులుగా వ్యవహరించి పలు ప్రశ్నలు అడిగారు. వాటికి తిరుపతిరావు అబ్బుర పరిచే రీతిలో సమాధానాలు చెప్పారు. కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు తిరుపతిరావును దుశ్శాలువ కప్పిన సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా మహాపాత్రో, ప్రశాంత్ కుమార్, జై.సాయిరాజ్, జి.సునీల్, జి.ప్రకాశరావు, ఎం.శంకరరావు, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

తిరుపతిరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అప్పలరాజు

ఇంటింటికీ తాగునీరు సరఫరా

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు రూ.వంద కోట్లతో తాగునీటి పథకం ఏర్పాటు చేస్తున్నామని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. కాశీబుగ్గ సంత మైదానంలో తాగునీటి పథకం నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు శంకుస్థాపన పనులను శనివారం పరిశీలించారు. ఈ శంకుస్థాపనకు నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, ఎఎంసి ఛైర్మన్ పి.వి.సతీష్, కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని గోకర్ణపురం పంచాయతీ రైతు భరోసా కేంద్రం ద్వారా గ్రామానికి చెందిన బి.సోమేశ్వరరావు అనే రైతు నుంచి ధాన్యం కొనుగోలును జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ప్రకటించడమే కాకుండా వారి నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామస్థాయిలోనే ఆర్‌బికె కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, డిసిఎంఎస్ ఛైర్పర్సన్ సల్ల సుగుణ, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, సర్పంచ్‌లు యారడి ఆనందరావు, జి.వేణు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ హైమావతి, ఎఒ ధనుంజయరావు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

ముమ్మరంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని అన్ని గ్రామ సంఘాల్లోని మహిళలు ముమ్మరంగా ముగ్గులు పోటీల్లో పాల్గొని పండగ వాతావరణం తలపించేటట్లు సందడి చేశారు. మండల మహిళా సమాఖ్య పిలుపు మేరకు అన్ని గ్రామ సంఘాల్లో మహిళలు భారీగా పాల్గొన్నట్లు మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. అక్కివరం పంచాయతీ పరిధిలోని గోపీనగర్, వంజంగి సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలను వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పాల్గొని పరిశీలించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారంతా మండలస్థాయి పోటీలకు అర్హులని తెలిపారు. మండలస్థాయి విజేతలంతా నియోజకవర్గస్థాయిలో ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా పాల్గొంటున్నట్లు వివరించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

రూ.30వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దశ్రీరాంపురానికి చెందిన పాడి రైతు లమ్మత సరస్వతి ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు స్థానిక ఎంపిటిసి మాదిన విమ, మాజీ సర్పంచ్ మాదిన రామారావు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. విశాఖ డెయిరీలో సభ్యులుగా ఉంటూ సరస్వతి మృతి చెందడంతో సంస్థ తరపున రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుమారుడు దిల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సూపర్‌వైజర్ ఈశ్వరరావు మాట్లాడుతూ పాడి రైతులకు అన్ని విధాల సంస్థ చేదోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు కృష్ణారావు, భుజంగరావు, రంగారావు, సంజీవరావు, జగన్, చలపతి, అప్పలరాజు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కోటియకొండపేటలో ఇటీవల కుక్కల దాడిలో 53 గొర్రెలు మృతి చెందాయని, ప్రభుత్వం గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలని ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి పాలిన సాంబమూర్తి ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో లండ అచ్చన్న, లండ మల్లేష్, సన్యాసి, కోణారి, హరికృష్ణలకు చెందిన 53 గొర్రెలు మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.ఆరు లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. దీంతో పెంపకందారులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.